జనసంద్రంగా అల్వాల్

వేలాదిగా తరలివచ్చిన గద్దర్ అభిమానులు

ఎటుచూసినా డప్పు చప్పుళ్లు, ఉద్యమ గీతాలాపన

ప్రజా గొంతుక చివరి చూపు కోసం పోటెత్తిన జనం



వెంకటాపురంలోని మహాబోధి విద్యాలయం వద్ద జన సందోహం

అల్వాల్: ప్రజాగాయకుడు గద్దర్ కడసారి చూపుకోసం సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో అల్వాల్, వెంకటాపురం ప్రాంతం జనసంద్రంగా మారింది. ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడంతో పోలీసులు, ప్రభుత్వ అధికార సిబ్బంది ఆ ప్రాంతంలో ఆంక్షలు విధించడంతో వేలాది మంది గద్దర్‌ను చూసేందుకు వచ్చిన వారు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం నుంచే జనం అల్వాల్‌కు చేరుకున్నారు. కవులు, కళాకారులు, ప్రజాసంఘాలు, అభిమానులు పాటలతో, డప్పుచప్పుళ్లతో ఎటుచూసినా సందడి నెలకొంది. పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకొని గద్దర్‌కు నివాళులర్పించారు. అంతిమ యాత్రను చూసేందుకు జనం భవనాలు, చెట్లపైకి ఎక్కారు. డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. కేవలం మీడియా, ప్రముఖులకు మాత్రమే అంత్యక్రియలను నేరుగా వీక్షించే అవకాశం కల్పించారు. వేలాది మంది అభిమానులు చివరి చూపు చూడకుండానే వెళ్లిపోవడం కనిపించింది. అంత్యక్రియలకు హాజరైన కవులు, ప్రజా సంఘాల ప్రతినిధులు గద్దర్‌తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి



గద్దర్ అంత్యక్రియలకు హాజరైన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



గద్దర్ సమాధి వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్, బుద్ధుడి చిత్రపటాలు



అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే సీతక్క, కాంగ్రెస్ శ్రేణులు



భవనాలపైకి ఎక్కి అంత్యక్రియలను వీక్షిస్తున్న ప్రజలు

క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: చెట్ల కొమ్మల కటింగ్ కారణంగా ఉప్పల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్ తెలిపారు. 11కేవీ ఉప్పల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, లక్ష్మారెడ్డి కాలనీ, రాఘవేంద్ర కాలనీ, హనుమసాయి కాలనీ, సూర్యనగర్, విజయపురి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవీ సరస్వతి నగర్ ఫీడర్ మర్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు సరస్వతి కాలనీ, ఆర్టీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జైళ్లశాఖ ఉత్పత్తులు భేష్



జైళ్లశాఖ స్టాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు

కుషాయిగూడ: తెలంగాణ జైళ్ల శాఖ ఉత్పత్తులు భేష్ అంటూ మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్ కితాబునిచ్చారు. పీపుల్స్ ప్లాజాలోని ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన జైళ్లశాఖ స్టాల్‌ను మంత్రులు ఎమ్మెల్సీ రమణతో కలిసి ప్రారంభించినట్లు జైళ్లశాఖ అధికారులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జైళ్లశాఖ ఉత్పత్తులపై అధికారులు వారికి వివరించారు. ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించిన వారు అభినందించినట్లు వెల్లడించారు. జైళ్లశాఖ ఐజీ రాజేష్, హైదరాబాద్ రేంజ్ డీఐజీ ఎస్.మురళిబాబు, చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్ల పర్యవేక్షణాధికారులు సంతోష్‌కుమార్ రాయ్, శివకుమార్, కళాసాగర్, శశికాంత్, పరశురాములు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్స్ క్యాంప్‌లో చిన్నారుల సందడి

లక్డీకాపూల్: కిడ్స్ క్యాంపులో నిరుపేద చిన్నారులు మైమరిచి ఆడిపాడారు. సోమవారం తూముకుంటలోని విశ్వవిశ్వాని సంస్థలు నిరుపేద పిల్లల కోసం ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసింది. సుధీర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన కళాశాల క్యాంపస్‌ను సందర్శించిన పిల్లలు ఇంటరాక్టివ్ సెషన్‌లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేరణాత్మక కథనాలను పంచుకున్నారు. అనంతరం విందును ఆస్వాదించారు. నిర్వాహకులు వారికి పుస్తకాలు, స్టేషనరీ కిట్లను అందజేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



లక్ష్మీనారాయణ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల కోసమే పనిచేస్తున్నట్లు ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానికులతో కలిసి కాంగ్రెస్ భరోసా యాత్రలో పాల్గొన్నారు. ఉప్పల్ డివిజన్ లక్ష్మీనారాయణ కాలనీలో చేపట్టిన కాంగ్రెస్ భరోసా యాత్రలో ఆమె మాట్లాడారు. తాను ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ఉప్పల్ డివిజన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంది శ్రవణ్‌రెడ్డి, తౌఫిక్, రఘుపతిరెడ్డి, లూకాస్, రామకృష్ణ, బాకారం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్‌లో పర్యటించిన కాంగ్రెస్ నేత రాగిడి

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో చిలుకానగర్‌లో కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి స్థానికులతో కలిసి సోమవారం పర్యటించారు. కళ్యాణపురి మర్రి చెట్టు వద్ద నెలల తరబడి చెత్త పేరుకుపోయిందని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాగిడి తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పర్యటించినట్లు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆర్‌కేహెచ్ కాలనీ నూతన కార్యవర్గం



మౌలాలి: మౌలాలి డివిజన్ రాధాకృష్ణ హౌసింగ్ సొసైటీ(ఆర్‌కేహెచ్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్.పోశెట్టి, ప్రధాన కార్యదర్శిగా సీ.సుధాకర్, ఉపాధ్యక్షుడిగా ఎస్.రాజేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా పురుషోత్తం ఎన్నికయ్యారు. పూర్తిస్థాయి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వార్డు కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన



నాచారం నూతన వార్డు కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

మల్లాపూర్: నాచారం డివిజన్ నూతన వార్డు కార్యాలయానికి రూ.78 లక్షలతో చేపట్టనున్న పనులకు సోమవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్ మాట్లాడుతూ అధునాతన వార్డు కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇందులో అని విభాగాల అధికారులు ఉండేలా మోడల్ కార్యాలయంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డీసీ ముకుందరెడ్డి, డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేతలు మేకల ముత్యంరెడ్డి, భూపాల్‌రెడ్డి, రమణారెడ్డి, కట్ట బుచ్చన్నగౌడ్, అశ్వత్థామరెడ్డి, టీకే రాజశేఖర్, అంజి, రామకృష్ణ, విఠల్‌యాదవ్, చంద్రశేఖర్, రఫీక్, కర్ణ, మారయ్య, శివ, తిరుపతి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

మల్లాపూర్: జీహెచ్‌ఎంసీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సోమవారం కార్మిక శాఖమంత్రి చామకూర మల్లారెడ్డికి బీఆర్‌ఎస్‌టీయు కాప్రా సర్కిల్ అధ్యక్షుడు జి.కుర్మన్న వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా కార్మికులకు 30 శాతం పీఆర్‌సీ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికుల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.



మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కుర్మన్న

జోరుగా ఫలహారం బండ్ల ఊరేగింపు



ఫలహారం బండి ఊరేగింపులో ఎమ్మెల్యే, కార్పొరేటర్

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని మల్లికార్జున్‌నగర్, ఎస్వీనగర్‌లో తొట్టెలు, ఫలహారం బండ్ల ఊరేగింపు ఆదివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. కళాకారుల నత్యాలు, పోతరాజుల నృత్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య కోలాహలంగా సాగింది. కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు బండారి లక్ష్మారెడ్డి, కాలనీవాసులు ధనుంజయ, సంతోష్‌యాదవ్, పీఆర్.ప్రవీణ్, పరమేశ్వర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వాసుగౌడ్, బుసాని రఘు, అజిత్, వెంకట్, సందీప్, సాయి, అపిల్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్ యూనియన్ ఎన్నిక



రామంతాపూర్: శ్రీనివాసపురం కమ్యూనిటీ హాల్‌లో సోమవారం గ్రేటర్ హైదరాబాద్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్ యూనియన్‌కు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండ బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సింగ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా ఐల శ్రీనివాస్‌రావు, ట్రెజరర్‌గా ఆదినారాయణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మేడ్చల్ జిల్లాలోని అన్ని డివిజన్‌లో ఎలక్ట్రికల్ టెక్నిషియన్ నేతలు పాల్గొన్నారు.

ఇందిరానగర్ నూతన కమిటీ ఎన్నిక

ఉప్పల్/రామంతాపూర్: రామంతాపూర్ ఇందిరానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా వి.అనంత రామన్ గౌడ్, అధ్యక్షులుగా గంగాధర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఆదినారాయణ గౌడ్, జాయింట్ సెక్రటరీగా జహంగీర్, సత్యనారాయణ, ఫయాజ్, ఆర్గనైజర్‌గా జక్రియ, సందీప్, మారుతి, కోశాధికారిగా వరప్రసాద్, ఫౌండర్ ప్రెసిడెంట్‌గా ఇంద్రపల్లి వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది.

పుట్టినరోజు వేడుకలు



జగదీష్‌గౌడ్ జన్మదిన వేడుకలు

మల్కాజిగిరి: బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ జన్మదిన వేడుకలు అభిమానులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సుధాకర్, కోటేష్, శ్రీనాథ్, కిరణ్, సంజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కుషాయిగూడ: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన లలిత కుటుంబ సభ్యులకు బీఎల్‌ఆర్ ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఆర్థికసాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆపదలో ఉన్న పేదలకు బీఎల్‌ఆర్ ట్రస్టు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు జలగం వెంకటేష్, దూసరి నవీన్‌గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన



మౌలాలి: ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రధానమైందని, విద్యార్థినులకు అవగాహన కల్పించే దిశగా పాఠశాలలో పలు కమిటీలకు ఎన్నికలు చేపట్టినట్లు ప్రిన్సిపల్ కవిత తెలిపారు. మౌలాలిలోని సికింద్రాబాద్ శాఖ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికల విధానంపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కో-ఆర్డినేటర్ సరస్వతి, సునీత, లావణ్య, ఉపాధ్యాయులు సిరాజ్ జరీనా, ఉదయలక్ష్మీ, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

మంత్రి మల్లారెడ్డి



బోనాల ఉత్సవాల్లో మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల ఉత్సవాలు నిలుస్తాయని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్ శ్రీబంగారు మైసమ్మ బోనాల ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అందరినీ చల్లగా చూడాలన్నారు. ఫలహార బండి ఊరేగింపులో యువత పాల్గొని ఆనందోత్సవాల మధ్య సంతోషంగా జరుపుకున్నారు. మేయర్ సామల బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, నేతలు పులకండ్ల జంగారెడ్డి, కొత్త చక్రపాణిగౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, గుర్రాల వెంకటేష్‌యాదవ్, మీసాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చల్లగా చూడాలి

నగర ప్రజలందరినీ బంగారు మైసమ్మ అమ్మవారు చల్లగా చూడాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శ్రీబంగారు మైసమ్మ దేవాలయం, అశోక్‌నగర్‌లోని అమ్మవారికి ఆయన కుటుంబ సభ్యులు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, తోటకూర అజయ్‌యాదవ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కొత్త దుర్గమ్మగౌడ్, పొద్దుటూరి శోభారాణి వెంకటేశ్ గుప్తా, మాజీ సర్పంచ్ తోటకూర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఉత్సవాల్లో వజ్రేష్‌యాదవ్

క్రీడలకు అత్యంత ప్రాధాన్యం



క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. ది రైట్స్ ఫౌండేషన్ మౌలానా మునీర్ అలీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పాల్గొని ప్రారంభించారు. యువత క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. దాదాపు 25 టీంలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన టీమ్ ప్రతినిధులకు బీఆర్‌ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి రూ.15 వేలను కార్తీక్ రైడర్స్ అందుకోగా, ద్వితీయ బహుమతి రూ.10 వేలను గ్రీన్ స్టార్స్ అడ్డగుట్ట టీమ్ అందుకుంది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, గంధం నాగేశ్వర్‌రావు, ఆలకుంట్ల హరి తదితరులు పాల్గొన్నారు.

బెదిరించి సెల్‌ఫోన్ లాక్కెళ్లారు..

కుషాయిగూడ: ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తిని బెదిరించి సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన దుండగులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన సోమవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 5న రాత్రి 10 గంటల సమయంలో చౌహాన్ మహేందర్‌సింగ్ అనే వ్యక్తి చర్లపల్లికి వెళ్లేందుకు కేబుల్ చౌరస్తా వద్ద ఉన్నాడు. ఆ సమయంలో అటువైపుగా వచ్చిన ఆటోలో ఉన్న జి.ఆకాశ్ అలియాస్ లడ్డు, పి.వీరేష్ ఎక్కడి వెళ్లాలంటూ చౌహాన్‌ను ఆటోలో ఎక్కించుకున్నారు. అతడిని మాటల్లో పెట్టి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి డబ్బులు ఇవ్వాలంటూ బెదిరించారు. డబ్బులు లేక పోవడంతో సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చర్లపల్లి పోలీసులు సోమవారం నిందితులు ఆకాశ్, వీరేష్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఆటో డ్రైవర్ ఆకాశ్‌పై కుషాయిగూడ, కీసర పోలీస్‌స్టేషన్లలో 5 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్



కుషాయిగూడ: ఆటోలో ప్రయాణిస్తూ ఓ మహిళ మరిచిపోయిన హ్యాండ్ బ్యాగ్‌ను ఆటోడ్రైవర్ పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. చర్లపల్లికి చెందిన మహిళ కేబుల్ చౌరస్తా నుంచి ఈసీనగర్ వైపు ఆటోలో ప్రయాణించింది. ఈ క్రమంలో ఆమె తన హ్యాండ్‌బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయి వెళ్లిపోయింది. హ్యాండ్‌బ్యాగ్‌ను ఆటోలో గుర్తించిన ఆటో డ్రైవర్ తోట్ల శివ చర్లపల్లి పోలీసులకు అప్పగించాడు. బ్యాగ్‌లో లభ్యమైన ఆధారాలతో బాధితురాలికి సమాచారం అందజేసి హ్యాండ్‌బ్యాగ్‌ను అందజేసినట్లు ఎస్ఐ నరసింహారావు, ఏఎస్ఐ శ్రీశైలం తెలిపారు. బాధితురాలు పోలీసులకు, ఆటోడ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలి



నేతన్న ఆడిగోపుల రామకృష్ణను సన్మానిస్తూ..

గౌతంనగర్: చేనేత దినోత్సవం సందర్భంగా గౌతంనగర్‌కు చెందిన సామాజికవేత్త అనిత చవాలి ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతంనగర్‌కు చెందిన వివిధ కాలనీవాసులు సామాజికవేత్తలు కలిసి నేతన్న ఆడిగోపుల రామకృష్ణను ఘనంగా సన్మానించారు. కనీసం వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో బహదూర్ లింగారెడ్డి, ధనుంజయ్, పార్వతి, విజయలక్ష్మీ, కవిత, బాబితా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు జర్నలిస్టుల వినతి

ఉప్పల్: చేనేత హస్తకళల మ్యూజియం ప్రారంభోత్సవానికి ఉప్పల్‌కు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు ఉప్పల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం జర్నలిస్టుల బృందం ఆయన్ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. 2008లో ప్రభుత్వం ఇచ్చిన పట్టాల సమస్యను పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రాన్ని అందుకున్న మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వచ్చేది తెలంగాణ ప్రభుత్వమేనని, జర్నలిస్టులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి చెప్పారు.

పరశురామా బ్రాహ్మణ సేవా మిత్ర నూతన కార్యవర్గం

గౌతంనగర్: పరశురామా బ్రాహ్మణ సేవామిత్ర రాష్ట్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షులు బ్రహ్మశ్రీ కులకర్ణి నరేష్‌శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బ్రాహ్మణ సేవామిత్ర ప్రధాన కార్యదర్శిగా మూగు నాగరాజుశర్మ, ఉపాధ్యక్షులు నవీన్‌శాస్త్రీ, సహాయ కార్యదర్శిగా తునికిపాటి సాయి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కాచాపురం అమరనాథ శర్మ, ప్రచార కార్యదర్శిగా ఏలూరి నాగవంశీకృష్ణశర్మను ఎన్నుకున్నారు. సమావేశంలో కోశాధికారి తునికిపాటి శివకుమార్, కార్యవర్గ సభ్యులు మూడుగుల ప్రసాద్ ఆత్రేయ, కొలచాల ఆనంద్, ధీరేంద్ర కులకర్ణి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గౌడవెల్లిలో ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ ప్రారంభించి మందులు పంపిణీ చేశారు. గుండ్లపోచంపల్లికి చెందిన మెడికల్ ఆఫీసర్ గాయత్రీ దేవి ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. 100 మంది వరకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆరోగ్యం పట్ల పాటించాల్సిన నియమాల కరపత్రాన్ని అందజేశారు. ఉపసర్పంచ్ పెంటమ్మ, వైద్యురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.